


# నేను - నా జ్ఞాపకాలు

## – జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 20ఆ9*

*(గత సంచిక తరువాయి)*

## నాకు జ్ఞాపకం లేని "ఆ అరవై రోజులు"

అమ్మ ప్రదర్శించిన ఆత్మస్థైర్యం నాకు కొండంత బలాన్ని ఇచ్చింది.

నా స్మృతి

*(70వ పుట్టిన రోజు) సాహితీ స్వర్ణోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 2010లో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ మరియు ఢిల్లీ తెలుగు అకాడమీ వెలువరించిన అభినందన సంచికలో ప్రచురించబడిన కొందరు ప్రముఖుల సందేశాలు, నా కుటుంబ సభ్యుల అభిప్రాయాలు*

***"వెండి తెర సాక్షిగా***

***(1993లో సితార పత్రికలో ప్రచురించిన కథనాలపై సమీక్ష)***

చిత్రసీమలో ప్రత్యక్ష పరిచయం, పెద్దగా లేనప్పటికీ సన్మిత్రులు జీడిగుంట రామచంద్రమూర్తి - చలనచిత్ర చరిత్రలోని 'కొన్ని' పుటల్ని నిశితంగా పరిశీలించారు. ఆ చరిత్ర ఓవందపేజీల గ్రంథం అనుకుంటే అందులోని ప్రతిపేజీలోనూ హీనపక్షం రెండువందల జతల కళ్ళు సతతం కన్నీళ్ళు కురిపిస్తూంటాయి. రామచంద్రమూర్తి ఆ కళ్ళని కలిశారు. ఆ హృదయాల్ని కదిపారు. ఫలితం, ఈ ఆర్ద్రత నిండిన జాలి కథలు..! ఈ గుండెల్ని కరిగించే కన్నీటి గాథలు.

జీడిగుంట వారి కృషిని హృదయపూర్వకంగా అభినందిస్తూ 'దీక్షాదక్షతలు' అనే ఎడ్ల బండి మీద కాక 'ఈజీమనీ' అనే ఎక్స్‌ప్రెస్ బండిలో తారాపథాన్ని చేరుకోవాలని ఉవ్విళ్ళూరే యువతరానికి ఈ 'కథనాలు' కనువిప్పు కలిగించగలవని ఆశిస్తున్నాను.

***జంధ్యాల.***

### అక్షర పుష్పం

జీడిగుంట రామచంద్రమూర్తి ఆకాశవాణి ద్వారా అందరికీ సుపరిచితులే. కథా రచయితగా, నవలా రచయితగా, నాటక కర్తగా, రేడియో కళాకారుడిగా వీరు చతుర్ముఖులు. నా పరిచయం వీరితో మూడు దశాబ్దాల క్రితం రేడియోలోనే కొద్దికాలం తరువాత నేను రేడియోలో డిప్యుటేషన్ పూర్తయి, ప్రమోషన్ మీద నా 'పేరెంట్ డిపార్ట్‌మెంట్' సమాచారశాఖకు వెళ్ళిపోయినా, రచనా వ్యాసంగం, ముఖ్యంగా నాటక రచన కూడా మమ్మల్ని అనేక కార్యక్రమాలలో కలుసుకునేందుకు వంతెన అయింది. నంది అవార్డు కమిటీలలోనూ, సాహితీ సభలలోనూ, వేదికని పంచుకునేలా చేసింది. రామచంద్రమూర్తిగారు మితభాషి, సౌమ్యులు, స్నేహశీలి. విషయాన్ని సూటిగా చెప్పగల నిబ్బరం కలవారు. అందుకే జనాకర్షణ పొందగలిగారు. ముఖ్యంగా నాటక రచయితగా నంది అవార్డులు వీరికి కీర్తినార్జించి పెట్టాయి.

సినిమా కథ అందించినా, మాటలు రాసినా, రేడియోలో తాను నిర్వహించిన 'బాలయ్య' పాత్రలో జీవించినా ఎక్కడా గర్వం అతనిని తాకలేదు. నిగర్వి, నిరాడంబరుడు, కనుకనే స్నేహసంపదను నిలబెట్టుకున్నారు. ఎవరినీ నొప్పించకుండా మాట్లాడడం వీరి నైజం. వాళ్ళబ్బాయి శ్రీధర్, తండ్రంతటివాడయ్యాడు నటనా రంగంలో. అలాగే ఒక మనవడు వరుణ్‌సందేశ్ కూడా కొన్ని చిత్రాలలో హీరోగా నటిస్తూ పేరు తెచ్చుకుంటున్నాడు. అలా రామచంద్రమూర్తిగారు, తన కుటుంబ సభ్యులకు, తన నటనా వారసత్వాన్ని పంచి సంతృప్తులయ్యారు.

*శారదా అశోక వర్ధన్*

*రచయిత్రి*

### సాహితీ వనంలో వికసించిన గులాబి శ్రీ జీడిగుంట

బ్రహ్మాంశతో కవి, విష్ణువాంశతో రాజు, నటరాజాంశతో మహానటుడు ఉద్భవిస్తారని పురాణోక్తి. కథకుడిగా, నవలా రచయితగా, నాటక రచయితగా, రేడియో, టీ.వీ చలన చిత్ర రచయితగా బహుముఖంగా, తన ప్రజ్ఞాప్రాభవాలతో పాఠకులనలరిస్తూ, సాహితీ సంపదను సమాజానికి పంచిన సాహితీ వల్లభుడు శ్రీ జీడిగుంట. వారి సాహిత్యశ్రీ గురించి తెలిసినా, వారితో పరిచయ భాగ్యం ఆరు సంవత్సరాల క్రితం హైదరాబాదు త్యాగరాయ గాన సభలో జి.వి.ఆర్ కల్చరల్ ఫౌండేషన్ వారు నిర్వహించిన కళాకౌశల పురస్కార మహోత్సవంలో లభించింది. ఆ రోజు వారి సరసన, ఆ పురస్కారం నేను కూడా అందుకోగలగటం నా పూర్వజన్మ సుకృతం.

కథ లోపల కదలిక తెలిసిన వాడే కథకుడు. కథలోనైనా, కవితలోనైనా ఫీల్ అనేది ఉండాలంటారు తిలక్. చిన్న చిన్న మాటల్తో, శిఖరాలవంటి భావాన్ని చూపిస్తు, సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో కథలు రాయడం ఆయన ప్రత్యేకత. అర్థం కాని సమాసాలతో, వర్ణనలతో, అంత్యప్రాసలతో, సంస్కృత పదజాలంతో పాఠకుల సహనానికి సమాధి కట్టకుండా, ఇంపైన పదాలతో, సొంపైన శిల్పాన్ని నిర్మించి గుండెను తడిమే అనుభూతిని పాఠకులకు కలిగించగలగటం ఆయనకు మాత్రమే తెలిసిన నైపుణ్యం. అక్షరాలనే సుగంధ సుమాలుగా మాలలల్లి, సంపెంగ పరిమళాలను అందిస్తూ సాహితీ విలువలకు చిరంజీవత్వాన్ని ఆపాదిస్తున్న సంస్కార సార్వభౌముడు. కథలను పిండి బతకటం కాకుండా బతుకుల్ని

పిండి కథలు వ్రాసే రసవిద్యను ఔపోసన పట్టిన అగస్త్యుడు శ్రీ జీడిగుంట. ఆయన కథలలో ఆర్తి ఉంటుంది, ఆర్ధ్రత వుంటుంది, ఆత్మీయత ఉంటుంది, అనుభూతి వుంటుంది, అభినివేశం వుంటుంది.

***నూతలపాటి సాంబయ్య, అధ్యక్షులు***

***తీపి గురుతులు***

గురూగారూ - రచయితగా మీకు సువర్ణోత్సవం జరుగుతున్న ఈ సందర్భంలో నా శుభాకాంక్షలు. మన స్నేహానికి కూడా 35 సంవత్సరాలు నిండాయనుకుంటా. 1975లో నేను రేడియో డ్రామా ఆడిషన్‌లో సెలక్టయినప్పుడు మీ తొలి పరిచయం. ఆ తరవాత మీరు నాటక విభాగానికి ప్రొడ్యూసర్‌గా రావటం నాకు ఎన్నో మంచి పాత్రలు ఇచ్చి ప్రోత్సహించడం, నన్నేకాదు నాలాంటి ఎంతోమందిని ఉత్సాహపరుస్తూ, శ్రోతలకు వినిపిస్తూనే కనిపించేలా సంభాషణలు పలికే చాతుర్యాన్ని నేర్పారు. 'నవలా స్రవంతి'లో మీరు స్వయంగా ఎన్నో ప్రయోగాలు చేశారు. రేడియో బాలయ్యగా శ్రోతల హృదయాల్లో చిరస్థాయిగా నిలచిపోయారు.

నాకు కథలంటే ప్రాణం. మీరు రాసిన కథలు ఎన్నో చదివాను. వాటిల్లో కనిపించే కుటుంబ విలువలు, ఆయా పాత్రల ఆర్ధ్రతా, మనసుకి హత్తుకుపోయే సంఘటనలూ కనిపించీ కనిపించని మెసేజ్.. పాఠకుడిగా నన్ను ఎంతో ఆకట్టుకునేవి.

"మీరిన్ని నాటకాలు వేస్తారు కదా నా చేత కూడా ఒక నాటిక రాయించకూడదూ" అని మీరు అడగగానే నాకు మీ 'అమూల్యం' కథా సంపుటిలో 'దుర్మార్గం' అనే కథ గుర్తుకు వచ్చింది. ఆ కథ తీసుకుందాం అనగానే "డాడీ! యూ ఆర్ గ్రేట్" అనే టైటిల్‌తో ఒక చక్కని నాటికను రాసి మాకందించారు. నాకింకా గుర్తు. ఆ నాటిక ప్రదర్శన రోజు, ముఖ్య అతిథి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ సి. నారాయణరెడ్డిగారు "పదినిమిషాలు చూసి వెళ్ళిపోతానయ్యా" అని, నాటిక పూర్తయ్యేవరకూ చూసి, తన ప్రసంగంలో సగభాగం నాటిక ప్రదర్శనని శ్లాఘించారు. 'ఈ నాటిక రాసి రచయిత చాలా సాహసం చేశాడు' అని మిమ్మల్ని పొగడ్తలతో ముంచెత్తారు, ఆ తర్వాత అశ్వఘోష, అమ్మకోముద్దు, 'సన్‌స్ట్రోక్', 'శ్రీవారి ప్రేమయాత్ర' ఇలా మీ కథల్నే నాటకాలుగా రాస్తూ నంది నాటక పోటీలలో బహుమతులు సంపాదించే స్థాయి రచనలు చేశారు. మీకూ, మీ మంచి మనసుకీ, మీ ఆత్మీయతకీ, మీ స్నేహభావానికీ మీ రచనా వ్యాసంగానికీ ఆ భగవంతుడు శతాయుష్షునివ్వాలని కోరుకుంటూ...

***ఉప్పులూరి సుబ్బరాయశర్మ***
***టి.వీ, సినీ నటులు***

**అరుదైన బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ జీడిగుంట.**

రామచంద్రమూర్తిగారు కథకులు, వ్యాసకర్త, నవలా రచయిత, రేడియో ఆర్టిస్టు, రేడియో నాటక కర్త. ఉద్యోగ విరమణ తర్వాతి పర్వంలో 'ఎలక్ట్రానిక్ మీడియా' సమన్వయ కర్త. ఇంకా బోలెడు సృజనాత్మక కార్యక్రమాల సృష్టికర్త. పైన చెప్పిన ప్రతి పార్శ్వంలోనూ ఒక రిసెర్చి స్కాలర్‌కి కావలసినంత మెటీరియల్ ఉంది. అందుకని ఏ ఒక్క పార్శ్వం గురించీ పూర్తిగా తెలీని నాకు ఆయన గురించి తెలిసిన కొన్ని విషయాలు వివరిస్తాను. ముఖ్యంగా ఆయన కుమారులు ముగ్గురూ కలిసి ప్రచురించిన కథల సంకలనం "అమ్మకో ముద్దు" ఈ మధ్యనే చదివిన కారణాన అందులో నన్ను కదిలించిన అంశాలను గురించి ముందుగా వివరిస్తాను.

ఒక పగలల్లా ఇంట్లో కూర్చుని ఆ సంకలనం అంతా చదివాను. ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. అలాంటి సంఘటనలెన్నో ఆ కథలనిండా పుష్కలంగా వున్నాయి. ఈ విషయమే ఆయనతో చెప్పాను. మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ వున్న మిత్రుడు గనుక "పగలు చదివితే రాత్రి నిద్రపట్టలేదంటే, వాటిని మీరు రాత్రిపూట చదివి ఉండాల్సిందని, చమత్కరించారు.

"అమ్మకోముద్దు" కథని రెండు గంటల స్టేజీ నాటకంగా మలచడం జరిగింది. Lifespanని అరడజను పేజీల్లోకి కుప్తీకరించగలిగిన చతురత ఉన్న రచయిత జీడిగుంట. దీనికి diametrically opposite ambience ఉన్న కథ 'సెకండ్ హ్యాండ్' మొదట్లో Lighterveinలో నడిచినా చివరికొచ్చేసరికి ప్రపంచ ప్రఖ్యాత కథాకారుడు 'ఓ హెన్రీ' తన కథల్లో ఇచ్చే కొసమెరుపు పాఠకుడి ధణుతెగరకొడ్తుంది. ఈ రెండు కథలూ రెండు different levelsలో నా చేత కంటతడి పెట్టించాయి.

అది 1995వ సంవత్సరం. మౌళిగారనే ఒక స్టార్ ప్రొడ్యూసర్, ఇండస్ట్రియలిస్ట్ భారీ ఎత్తున "వాసంత సమీరం" అనే ఒక టెలీఫిల్మ్ ప్రొడ్యూస్ చేశాడు. ముఖ్య తారాగణంలో నేనూ ఉన్నాను. ఈనాటి ప్రముఖ యాంకర్ లేడీ ఉదయభాను నా కుమార్తెగా అరంగేట్రం చేసింది. దర్శకుడు పి.వి చలంతో కలసి ఈ ప్రొడ్యూసర్ టెలీఫిల్మ్ తాలూకు ప్రివ్యూ భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. ఆ ప్రివ్యూ వీక్షించడానికీ, సమీక్షించడానికీ జీడిగుంటగార్ని కూడా ఆహ్వానించారు. ఆ ప్రివ్యూ అనంతరం ఏర్పాటు చేసిన డినన్‌ర్‌లో నాతో పిచ్చాపాటీ మాట్లాడుతూ జీడిగుంటగారు "శ్రీ రాములుగారూ ఇంత సీనియర్ ఆర్టిస్టు అయిన మీరు ఆకాశవాణిలో ఇంకా "ఎ"గ్రేడ్‌లో వుండిపోవటం అన్యాయం. ఒకసారి AIR కి వచ్చి మీరు రెండు ఆడియో క్లిప్పింగ్స్ ఇవ్వండి. వాటిని ఢిల్లీకి పంపుతాం. ఎవరికైనా టాప్ గ్రేడ్ ఇవ్వాలంటే అది ఢిల్లీలోనే శాంక్షన్ కావాలి అన్నారు. కొత్త గొంతుల్ని ఆకాశవాణికి పరిచయం చెయ్యాలి అనే ఆలోచన అనేకమంది ఆకాశవాణి ప్రొడ్యూసర్స్‌కి వుండొచ్చుగానీ, ఒక ప్రామాణికతని సంతరించుకున్న మంచి గొంతుకి ప్రమోషన్ ఇవ్వాలనే ఆలోచన ఎవరికీ రాలేదు. ప్రమోట్ కావాలని నా అంతట నేనూ ఏనాడూ ప్రయత్నించలేదు. ఆ ఆలోచన రూపుదిద్దుకుని నేను టాప్‌గ్రేడ్‌లోకి ప్రమోట్ కావడం ఆ రెండు నెలల్లోనే జరిగిపోయింది. పదిరూపాయల ఆర్టిస్టుగా రేడియో ప్రయాణం మొదలుపెట్టిన నేను జీడిగుంటగారి కారణంగా మూడువేల రూపాయల కాజువల్ ఆర్టిస్టుగా పెరిగాను. ఈ విషయం ఎప్పుడైనా ప్రస్తావనకొస్తే ఆయన్ని ఎంతో ఎంబరాస్ చేసినట్లుగా ఫీల్ అవుతారు ఇది ఆయనలోని సింప్లిసిటీకి ఒక చిన్న నిదర్శనం మాత్రమే.

ఇక్కడ మరో విషయం చెప్పాలి. జీడిగుంటగారి రెండో అబ్బాయ్ శ్రీధర్ మా దగ్గర ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నాటక కళని అభ్యసించి గోల్డ్ మెడల్ సాధించాడు. టీ.వి సీరియల్స్‌లో ప్రముఖంగా పాల్గొంటున్నాడు. ఒక వ్యక్తిలో వున్న ప్రతిభా వ్యుత్పత్తులు వారి పిల్లలకు జీన్స్ ద్వారా చేరతాయనడానికి ఇదో నిదర్శనం. అలాగే వారి పెద్ద మనుమడు 'వరుణ్ సందేశ్' హ్యాపీడేస్ సినిమాలో నటించే అవకాశం రావటంతో అమెరికాలో చదువుకుంటూ ఇండియా వచ్చి సినిమా హీరో అయ్యాడు.

***డా. చాట్ల శ్రీరాములు***

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

COMMENTS